మనం ఎవరికి ఏం ఇచ్చినా మంచిది ఇవ్వడం ఎప్పుడూ శ్రేష్టం. అనాథ శరణాలయానికి గుండీలు ఊడిపోయి, చిరిగిన దుస్తులని, ఇలా పనికిరానివి ఇచ్చే బదులు ఉత్తమమైనవి ఇవ్వడం ఆచరించాలి. ఎందుకంటే అవి ఎవరికి చేరతాయో మనకి తెలీదు.

## 102. వేచి వుండు

ఓ గురువు దగ్గర శిష్యరికం చేసి శాస్త్రాలన్నిటినీ ఔపోసన పట్టిన ఓ శిష్యుడు తన గురువుతో ఓ రోజు చెప్పాడు.

"నేను వెళ్ళి అందరికీ దేవుడి గురించి బోధించి భగవత్ భక్తిని ప్రచారం చేయాలని అనుకుంటున్నాను స్వామీ."

"కొన్నాళ్ళు వేచి వుండు." జవాబు చెప్పాడు గురువు.

కొంతకాలం గడిచాక మళ్ళీ ఆ శిష్యుడు గురువుతో చెప్పాడు.

"నేను వెళ్ళి అందరికీ దేవుడి గురించి బోధించి భగవత్ భక్తిని ప్రచారం చేస్తాను స్వామీ."

"కొన్నాళ్ళు వేచి వుండు." మళ్ళీ జవాబు చెప్పాడు గురువు.

ఇంకొంతకాలం గడిచాక మళ్ళీ ఆ శిష్యుడు గురువుతో చెప్పాడు.

"నేను వెళ్ళి అందరికీ దేవుడి గురించి బోధించి భగవత్ భక్తిని ప్రచారం చేస్తాను స్వామీ."

" ఇంకా కొన్నాళ్ళు వేచి వుండు." మళ్ళీ అదే జవాబు చెప్పాడు గురువు.

"నేనింకా ఎంతకాలం వేచివుండాలి?" విసిగి వేసారిన ఆ శిష్యుడు గురువుని అడిగాడు.

"భగవంతుడి గురించి ఇతరులకి బోధించాలన్న ఆత్రుత నీలో నశించే దాకా." జవాబు చెప్పాడు గురువు.

ఎప్పుడైతే భగవంతుడి గురించి బోధించడంలో ఆనందాన్ని అనుభవించడం ఆరంభిస్తాడో అప్పుడు ఆ మనిషి అందులో మునిగిపోయి తన ఆధ్యాత్మిక ప్రగతికి సంబంధించిన సాధనలకి దూరం అవుతాడు.